క్లుప్తంగా

చెరువులను కాపాడండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

ఎన్పీకుంట: దేవరచెరువుతో పాటు మండల కేంద్రంలోని పెద్దచెరువులను కబ్జాదారుల నుంచి కాపాడాలని సీపీఐ మండల కార్యదర్శి జి రమణ సోమవారం తహసీల్దార్ దేవేంద్రనాయక్‌కు వినతిపత్రం అందించారు. సర్వే నంబరు 580లో దేవరచెరువుకు సంబంధించి 61.58 ఎకరాల భూ విస్తీర్ణం కలిగి ఉన్నట్లు రెవెన్యూ రికార్డులలో ఉందని, కానీ క్షేత్రస్థాయిలో చెరువు విస్తీర్ణం సగానికి పైగా కబ్జాకు గురైందని తెలిపారు. మండల కేంద్రంలోని పెద్దచెరువు సైతం కబ్జాకు గురైందని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పూల శ్రీనివాసులరెడ్డి

గాండ్లపెంట: మండల కేంద్రంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త మిద్దె శ్రీనివాసులు(48) ఆదివారం రాత్రి గుండెపోటుకు గురై మృతి చెందారు. విషయం తెలుసుకున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసులరెడ్డి సోమవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుమారుడు హరీష్, భార్య సుగుణమ్మకు తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసి, ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, మాజీ కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, నాయకులు నరసింహాగౌడ్, ఇక్బాల్, మాజీ సర్పంచ్ చంద్రశేఖరరెడ్డి, కార్యకర్తలు నాగరాజు, ప్రభాకరరెడ్డి, నజీర్‌ఖాన్, మహేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ధర్మవరం: స్వచ్ఛ భారత్ కార్మికులు, ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాల సమస్యలను సత్వరం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, నాయకులు జేవీ రమణ, జంగాలపల్లి పెద్దన్న కోరారు. ఈ మేరకు సోమవారం ఆర్డీఓ మహేష్‌కు వినతిపత్రం అందజేశారు.

వీధిలైట్లు వెలగడం లేదు

తనకల్లు: కొక్కంటిక్రాస్ వద్ద పెట్రోల్ బంక్ నుంచి నల్లగుట్లపల్లి వరకు జాతీయ రహదారి మధ్యలో వీధిలైట్లు వెలగడం లేదని సీపీఐ నాయకులు సోమవారం తహసీల్దార్ శోభ సువర్ణమ్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రెడ్డెప్ప, నాయకులు శ్రీనివాసులు, రవికుమార్, దొడ్డెప్ప, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

• చీకటిమానిపల్లిలోని శ్మశాన వాటిక అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని ప్రజా సంఘాల నాయకులు తోపు పారెసు, చంద్రప్ప ఎంపీడీఓ రెడ్డెప్పకు వినతిపత్రం అందజేశారు.

రక్తదాతకు జాతీయ పురస్కారం


అవార్డు అందుకుంటున్న చెడిపోతుల వీరప్ప

బత్తలపల్లి: తలసేమియా రోగులతో పాటు అత్యవసరమున్న వారికి 'రక్త బంధం ట్రస్టు' ద్వారా సకాలంలో రక్తం సమకూరుస్తున్న దాత చెడిపోతుల వీరప్పకు 'సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పురస్కారం' ప్రదానం చేశారు. బత్తలపల్లి మండలం పోట్లమర్రికి చెందిన చెడిపోతుల వీరప్పకు గుంటూరులో ఆదివారం పొన్నూరు కిరాణా అసోసియేషన్ కళ్యాణ మండపంలో మన పొన్నూరు బ్లడ్ అసోసియేషన్ 9వ వార్షికోత్సవం సందర్భంగా మన పొన్నూరు బ్లడ్ అసోసియేషన్ చైర్మన్ టి.ఉమాశంకర్, ప్రముఖ కవి, రచయిత రంగుశెట్టి రమేష్, ఉద్యోగ, రాజకీయ విశ్లేషకులు చందు సాంబశివరావు, పార్వతినాయుడు చేతుల మీదుగా ఈ పురస్కారం అందజేసినట్లు వీరప్ప సోమవారం మీడియాకు వెతలిపారు. గత ఎనిమిదేళ్లుగా పలువురు తలసేమియా చిన్నారులకు రక్తదానం చేస్తూ, అభాగ్యులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు.

కఠోర దీక్ష... ఆరోగ్య రక్ష

- రంజాన్ మాసంలో 'రోజా'కు ఎంతో ప్రాధాన్యం
- ఉపవాస దీక్షలతో శరీర ప్రక్షాళన
- నమాజుతో శరీరానికి వ్యాయామం
- 31న రంజాన్ పండుగ


సామూహికంగా నమాజ్ చేయిస్తున్న ముతవల్లి (ఫైల్)


ఉపవాస దీక్ష విడుస్తున్న ముస్లింలు

ధర్మవరం అర్బన్: ముస్లింలకు రంజాన్ పవిత్ర మాసం. నిత్యం నమాజులతో గడపడం.. రోజా(ఉపవాసం) ఉండే వారి దినచర్య ఆకలి, దప్పికల్ని ఓర్చడం, చెడు వ్యసనాలను వీడడం, ప్రశాంతంగా గడపడం ఈ మాసం ప్రధాన లక్ష్యం. ఇలా చేయడం వల్ల పరోక్షంగా శరీరానికి మేలు జరుగుతుంది. రుగ్మతలు తొలగిపోతాయి. ఆరాధనా భాగ్యంతో పాటు ఆరోగ్య యోగం కూడా లభించి ఆనందాన్ని, సంతృప్తిని మిగుల్చుతుంది. ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే రంజాన్ మాసం ప్రస్తుతం నడుస్తోంది. పిల్లలు మినహా ముస్లిం స్త్రీ, పురుషులంతా 30 రోజుల పాటు రోజా(ఉపవాసం) ఉండటాన్ని విధిగా భావిస్తారు. వేకువజామునే నిద్రలేచి, స్నానమాచరించి, అల్పాహారం(సెహరీ) తీసుకోవడం ద్వారా రోజా చేపడతారు. సాయంత్రం సూర్యాస్తమయం వరకు కఠోర ఉపవాస దీక్ష చేస్తారు. ఎలాంటి ఆహార, పానీయాలూ స్వీకరించరు. సాయంత్రం ఇఫ్తార్ (ఏదైనా ఆహారాన్ని స్వీకరించడం) ద్వారా రోజాను ముగిస్తారు.

■ ధర్మవరం పట్టణంలో మదీనా మసీదు, జామియా మసీదు, ఖిల్లా మసీదు, ఇలా దాదాపు దాదాపు 32 వరకు మసీదులు ఉన్నాయి. ఇక నియోజకవర్గంలోని ధర్మవరం రూరల్, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాలను కలుపుకుంటే దాదాపు 60 వరకు మసీదులుంటాయి. ఈ మసీదుల్లో ప్రతిరోజూ రంజాన్ మాసంలో ముస్లింలు ఐదు పూటలా నమాజ్ చేస్తారు.

చెడు వ్యసనాలకు దూరంగా...

మద్యం తాగడం, పేకాట ఆడటం, మత్తు పదార్థాలు తీసుకోవడం, వ్యభిచారం, అశ్లీలత వంటి దుర్గుణాలకు దూరంగా ఉంటారు. ఇలా ఒక వ్యక్తి 12 గంటలు వీటన్నింటికీ దూరమైతే వారిలో ఆ వ్యసనాన్ని త్యజించే మానసిక సంసిద్ధత ఉద్భవిస్తుందని మానసిక నిపుణులు పేర్కొంటున్నారు. ఇలా 21 రోజులపాటు ఒక క్రమపద్ధతి అనుసరిస్తే వారి జీవనం అందుకు అనుగుణంగా మార్పు చెందుతుంది. ఇలా రోజా 30 రోజులపాటు మనిషిని చెడు వ్యసనాలకు దూరం చేసి సన్మార్గుడిగా తయారు చేస్తుంది. ఉపవాస దీక్ష కఠిన శిక్ష లాంటిది. తద్వారా శరీర ప్రక్షాళన జరిగి ఆరోగ్యం బాగుపడుతుంది. పాంచ్‌వఖత్ (ఐదు పూటలు) నమాజ్ చేస్తారు. ప్రార్థనలో భాగంగా పలుమార్లు వంగడం, మోకాళ్లపై కూర్చోవడం, నిల్చోవడం చేయడం ద్వారా ఇది ఓ వ్యాయామం మాదిరి శరీరానికి మేలు చేస్తుంది. మహిళలు ఇళ్లలో నమాజ్ చేస్తారు.

ఏకాగ్రత పెరుగుతుంది



రోజూ ఉపవాసం ఉండి నమాజ్ చేస్తూ గడపడం వల్ల మనసు ప్రశాంతంగా మారి, ఏకాగ్రత పెరుగుతుంది. నేటి యువత చెడు మార్గాలకు దూరం అవుతారు. అంతేకాక రోజూ ఐదు పూటలా నమాజ్‌కు ముందు వజూ చేయటం అంటే బయటకు కనపడే శరీరాన్ని శుభ్రపరచడం వల్ల క్రిమికీటకాలు దూరమై శరీరం కాంతివంతంగా, ఆరోగ్యంగా ఉంటుంది. ఉపవాస దీక్ష చేయడం వల్ల దైవ చింతనతో పాటు ఆరోగ్యంగా ఉంటారు. శరీర బరువు అదుపులోకి వస్తుంది. కాలేయంపై ఒత్తిడి తగ్గుతుంది. ఆకలి బాధ, మానసిక స్థితి నియంత్రణలో ఉంటాయి. చురుకుదనం పెరుగుతుంది. జీర్ణాశయం శుభ్రంగా తయారై ఆమ్లాలు విడుదలై సులభంగా జీర్ణమవుతుంది. ఉపవాసాల తర్వాత మనిషి మరింత ఆరోగ్యంగా ఉంటారు.

– తౌసిఫ్, ధర్మవరం

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి


మాట్లాడుతున్న మీనుగ నాగరాజు

రామగిరి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేద్దామని పార్టీ మండల కన్వీనర్ మీనుగ నాగరాజు సూచించారు. సోమవారం కలికివాండ్లపల్లిలో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కులం, మతం, ప్రాంతం, పార్టీలను చూడకుండా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా పథకాలు అమలు చేయడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చెన్నకేశవ రెడ్డి, ఎంపీటీసీ కొండన్న, నాయకులు రామకృష్ణారెడ్డి, శివారెడ్డి, సంతోష్ కుమార్, గంగిరెడ్డి, రామాంజనేయులు, గోపాల్‌రెడ్డి, గొల్లరాజప్ప, గొల్ల నాగరాజు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కదిరి టౌన్: కుమ్మరవాండ్లపల్లిలో ఆదిలక్ష్మమ్మ అనే మహిళ అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ హరిప్రసాద్ ఆమె దహన సంస్కారాల నిమిత్తం రూ.10 వేల ఆర్థికసాయం అందించారు.

బకాయిలు చెల్లించాలి

కనగానపల్లి: మండల కేంద్రంలోని గ్రంథాలయాలనికి సంబంధించిన పన్ను బకాయిలను వెంటనే చెల్లించాలని గ్రంథాలయాధికారి గోవిందు పంచాయతీ అధికారులను కోరారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి పన్ను బకాయిలపై ఎంపీడీఓ అనిల్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు.

మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించండి


మాట్లాడుతున్న ఏపీ మీటర్ రీడర్స్ సంఘం నాయకులు

ధర్మవరం: మీటర్ రీడర్‌లకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం అమలు చేయాలని ఏపీ మీటర్ రీడర్స్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్ కుమార్, ఏఐటీయూసీ నాయకులు ఎర్రమశెట్టి రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మీటర్ రీడర్లు ప్రతి నెలా వచ్చే కమీషన్‌ల ద్వారా పూట గడవడం దుర్భరంగా మారుతోందన్నారు. ఉద్యోగభద్రత కోసం ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్నామన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించక పోగా రీచార్జ్ మీటర్‌లు ఏర్పాటు చేసి మీటర్ రీడర్ల భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేస్తోందన్నారు. మీటర్ రీడర్ల డిమాండ్ల సాధన కోసం ఈ నెల 18న డీఈ కార్యాలయాన్ని, 20న ఎస్ఈ కార్యాలయాన్ని, 27న సీఎండీ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు ప్రకటించారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు దస్తగిరి, రాజు, జగదీష్, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై సీఐ సునీత చిన్నచూపు

• ఎస్పీకి ఎమ్మార్పీఎస్ నేతల ఫిర్యాదు

పుట్టపర్తి టౌన్: శ్మశానవాటిక స్థల వివాదం పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన దళితులను కించపరిచే విధంగా మాట్లాడిన అర్బన్ సీఐ సునీతపై ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ పుట్టపర్తి మున్సిపాలిటీలోని ఒకటో వార్డు సాయినగర్ దళిత శ్మశానవాటికకు ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 274-5 లెటర్‌లో 75 సెంట్ల భూమిని గతంలో రెవెన్యూ అధికారులు శ్మశానవాటికకు వినియోగించుకోండని తెలిపారన్నారు. ఆ మేరకు తాము బోర్డులు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ విషయమై ఆదివారం అర్బన్ సీఐ సునీత ఎమ్మార్పీఎస్ నాయకులను స్టేషన్‌కు పిలిపించి గౌరవం లేకుండా మాట్లాడారని ఆరోపించారు. ఎస్పీ స్పందించి విచారణ చేసి, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తిప్పన్న, ఎమ్మార్పీస్ నాయకులు ఫొటోసాయి, ఎస్టీడీ నరసింహులు, రామయ్య, సత్తెన్న, పైపల్లి నరసింహులు, గంగాద్రి, ఓబుశేసు, తిప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం


ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

తనకల్లు: తిరుమలయ్యగారిపల్లిలో రైతు చంద్రారెడ్డికి చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను ముళ్ల పొదల్లోకి తీసుకెళ్లి పగులగొట్టారు. విలువైన వైర్లను ఎత్తుకుని పరారయ్యారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు


కదిరిలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు


ధర్మవరంలో నోటీస్ బోర్డులో రూమ్ నంబర్లు చూస్తున్న విద్యార్థులు


గాండ్లపెంటలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

ధర్మవరం/ కదిరిటౌన్/ తాడిమర్రి/ ఎన్పీకుంట/ గాండ్లపెంట/ బత్తలపల్లి / తలుపుల/ ఓడీచెరువు: తలుపుల మండలంలో 302 మంది విద్యార్థులకు గాను 300 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రాన్ని ఎంపీడీఓ రామానాయక్, తహసీల్దార్ రెడ్డిశేఖర్, ఎంఈఓ వెంకట్రాముడు తనిఖీ చేశారు. ఓడీచెరువు మండలంలో 692 మందికి గాను 689 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని మండల విద్యాశాఖ అధికారి సురేష్ బాబు తెలిపారు. : పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. కేంద్రాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రుల హడావుడి కనిపించింది. తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా సాగాయి. ధర్మవరంలోని 11 పరీక్ష కేంద్రాల్లో 2,443 మంది విద్యార్థులకు గాను 2,430 మంది పరీక్షలు రాశారు. ఎంఈఓలు రాజేశ్వరి, గోపాల్ నాయక్‌లు పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు. డీఎస్పీ హేమంత్‌కుమార్, వన్‌టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్‌లు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. కదిరిలో పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఆర్డీఓ వీవీఎస్ శర్మ పరిశీలించారు. పరీక్షలు సక్రమంగా జరుగుతున్నవని సంతృప్తి వ్యక్తం చేశారు. పట్టణ, రూరల్ పరిధిలో 1,967 మంది విద్యార్థులకు గాను 1955 మంది పరీక్షలు రాశారు. ఆర్డీఓ వెంట ఎంఈఓ ఓబులరెడ్డి ఉన్నారు. తాడిమర్రిలో ఛీఫ్ సూపరింటెండెంట్ చెన్నకృష్ణారెడ్డి, డిపార్ట్‌మెంట్ అధికారి నాగరత్నమ్మల పర్యవేక్షణలో ఇన్విజిలేటర్లు పరీక్షలను సజావుగా నిర్వహించారు. 223 మంది విద్యార్థులకు గాను 221 మంది పరీక్షలు రాశారు. ఎన్పీకుంటలో 176 మంది విద్యార్థులకు గాను ఒకరు గైర్హాజరయ్యారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఎంపీడీఓ అంజినప్ప తనిఖీ చేశారు. గాండ్లపెంటలో 230 మంది విద్యార్థులకు గాను 227 మంది పరీక్షలకు హాజరయ్యారు. బత్తలపల్లి మండలంలో 430 మంది విద్యార్థులకు గాను 427 మంది పరీక్షలు రాశారని ఎంఈఓలు చాముండేశ్వరి, సుధాకర్‌నాయక్ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.


చెన్నేకొత్తపల్లిలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న దృశ్యం

144 సెక్షన్ అమలు చేశారు.

చెన్నేకొత్తపల్లి/కనగానపల్లి: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. చెన్నేకొత్తపల్లి మండలంలో మొదటి రోజు 255 మంది విద్యార్థులకు గాను ఇద్దరు గైర్హాజరైనట్లు పరీక్షల చీఫ్ రవికిరణ్ తెలిపారు. కనగానపల్లి మండలంలోని 9 పాఠశాలలకు చెందిన 320 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. తొలిరోజు జరిగిన తెలుగు పరీక్షకు 319 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ అరుణమ్మ తెలిపారు.

నాటుసారా తయారు చేస్తే కఠిన చర్యలు


గ్రామసభలో మాట్లాడుతున్న జిల్లా ఎక్సైజ్ అధికారి గోవిందు నాయక్

నల్లచెరువు: గ్రామాల్లో నాటుసారా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎక్సైజ్ అధికారి గోవిందు నాయక్ హెచ్చరించారు. బాలేపల్లి తండాలో సోమవారం తనకల్లు ఎక్సైజ్ శాఖ వారు నాటుసారా తయారీకి వ్యతిరేకంగా నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. జిల్లా ఎక్సైజ్ అధికారి మాట్లాడుతూ నాటుసారా తయారీ, అమ్మకాలకు స్వస్తి పలకాలన్నారు. గ్రామ పెద్దల సమక్షంలో నాటుసారా నిర్మూలన, నవ సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చి దిద్దేందుకు ప్రజలు తమవంతు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా నాటుసారా తయారీకి వ్యతిరేకంగా గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తనకల్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు, ఎస్ఐ జిలాన్‌బాషా, నల్లచెరువు ఎస్ఐ మక్బూల్ బాషా, ఆర్ఐ లక్ష్మీదేవి, సర్పంచ్ సోనాలమ్మ, హైటెక్ రమణ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా జోలికి వెళ్లొద్దు

తనకల్లు: ప్రాణాంతకమైన నాటుసారా జోలికి వెళ్లకూడదని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ మారుతీరావు అన్నారు. మండలంలోని గేమేనాయక్‌తండాలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో నాటుసారా తయారు చేయడం, విక్రయించడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాటుసారా నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలని తెలిపారు. అనంతరం నాటుసారా వలన కలిగే నష్టాలపై కళాజాతా నిర్వహించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ జిలానీ బాషా, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా కుర్లపల్లయ్య, పెదయ్య స్వాముల ఊరేగింపు


స్వాములను ఊరేగిస్తున్న భక్తులు

కనగానపల్లి: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి ధర్మపురి కుర్లపల్లయ్య, పెదయ్యస్వాముల ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. స్వామి కాపులు పామాల కిష్టప్ప, ముత్యాలమ్మ ఆధ్వర్యంలో కుర్లపల్లయ్య స్వామి, స్థానిక గ్రామస్తుల ఆధ్వర్యంలో పెదయ్య స్వామిని వెండి గొడుగులు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. తిరిగి సోమవారం సాయంత్రం కూడా స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు.

పూల శ్రీనివాసరెడ్డికి సన్మానం


పూల శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న నల్లచెరువు వైఎస్సార్‌సీపీ నాయకులు

నల్లచెరువు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన పూల శ్రీనివాసరెడ్డిని నల్లచెరువు నాయకులు సోమవారం కదిరిలోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దశరథ నాయుడు, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, మైనార్టీ జిల్లా కార్యదర్శి నజీర్, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ నాగభూషణ, నాయకులు కళ్లిపల్లి శ్రీనివాసులు, రామాంజనేయులు, ఎంఆర్ ఆంజనప్ప, హనుమంతురెడ్డి, బాబూరెడ్డి, హరి, ఎల్లారెడ్డి, మహమ్మద్ రఫి, పోలీస్ రెడ్డెప్ప, శంకర తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారి విధులకు డుమ్మా


డాక్టర్ కోసం ఎదురుచూస్తున్న రోగులు

కదిరి టౌన్: పట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రమీల సోమవారం విధులకు గైర్హాజరయ్యారు. ఉదయం పది నుంచే రోగులు ఆస్పత్రికి చేరుకున్నారు. గంటల తరబడి ఎదురుచూస్తున్నా డాక్టర్ రాకపోయేసరికి సహనం కోల్పోయారు. డాక్టర్‌ను ఫోన్‌లో సంప్రదించినా అందుబాటులోకి రాలేదు. దీంతో కొందరు సిబ్బంది ఆస్పత్రిలో పరిస్థితిని ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇది కొంతసేపటికే వైరల్‌గా మారింది. సోషల్ మీడియా వేదికగా రోగులు పడుతున్న ఇబ్బందులపై డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేంద్రనాయక్ స్పందించారు. సదరు డాక్టర్ లీవ్ పెట్టలేదని, ఎటువంటి పర్మిషనూ తీసుకోలేదని చెప్పారు. గైర్హాజరు ఎందుకయ్యారో విచారణ చేసి.. తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అద్భుతం.. బేరిపల్లి వాసుల కోలాటం


కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు

కదిరి టౌన్: లయబద్ధంగా ఆడిపాడి అలరించే కళ కోలాటం సొంతం. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులు భజనలు చేయడం, కోలాటాలు ఆడటం చూస్తూనే ఉంటాం. లయబద్ధంగా అందరూ ఒకే రకమైన కదలికలతో పాటలు పాడుతూ స్వామివారిని స్తుతిస్తూ కోలాటం ఆడుతారు. అనేక ప్రాంతాల్లో చిన్నారులు, మహిళలు, కళాకారులు వారి స్థాయిల్లో కోలాటాలు ఆడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం చూస్తూనే ఉంటాం. కదిరి మున్సిపల్ పరిధిలోని బేరిపల్లి కాలనీ మహిళలు మాత్రం శ్రీఖాద్రీ లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాల కోసం రెండు నెలల పాటు కష్టపడి నేర్చుకుని కళను ప్రదర్శిస్తారు. ప్రస్తుతం జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజూ బృందంగా ఏర్పడి కోలాటం ప్రదర్శిస్తూ అలరిస్తున్నారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాల గురించి తెలుసుకొని, వాటిని ఆచరించి భావితరాలకు అందించినప్పుడే సార్థకత చేకూరుతుందని వారంటున్నారు.

పంట రుణాలు రెన్యూవల్ చేసుకోండి

ఎన్పీకుంట: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రైతులు తీసుకున్న పంట రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని ఇన్‌చార్జ్ సీఈఓ బయారెడ్డి తెలిపారు. సొసైటీ సిబ్బంది సుమశ్రీ సోమవారం మాట్లాడుతూ రుణాలు పొందిన రైతులు ఈ నెల 29 లోపు పట్టాదార్ పాసుపుస్తకం, ఆధార్, 1బి, అడంగల్ తీసుకొని సంఘం సీఈఓని సంప్రదించాలని సూచించారు.

25న మండల సర్వసభ్య సమావేశం

బత్తలపల్లి: ఈ నెల 25న ఉదయం పది గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహనాయుడు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షత వహిస్తారన్నారు. ప్రజా ప్రతినిధులు అందరూ సమావేశానికి హాజరు కావాలని కోరారు. అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో తప్పకుండా హాజరు కావాలని సూచించారు.